13-02-2025
గురువారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 02 | సంచిక : 150 | పేజీలు : 8 | వెల : 4

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి

మేడారం సమ్మక్క సారలమ్మలంటే కోట్లాదిమంది భక్తులకు ఎంతో నమ్మకం. బుధవారం ఉదయం మినీ మేడారం జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు మినీ మేడారం జాతర కొనసాగనుంది. గిరిజన పూజారులు ఆదివాసీ గిరిజన ఆచారం సంప్రదాయాల పద్ధతిలో వనదేవతలకు పూజలు నిర్వహిస్తారు. ఉదయం పూజారులు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో జాతర ప్రారంభమైంది. జాతరకు భక్తులు పోటెత్తనున్నారు. జాతరకు తరలివచ్చే భక్తుల కోసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.



# మినీ మేడారం

## వనదేవతలకు పూజలు

**జయభేరి, వరంగల్, ఫిబ్రవరి 12:**

భక్తుల కోసం ఆర్టీసి 400 ట్రిప్పులను నడుపుతుంది. ములుగు జిల్లా అభయారణ్యంలో కొలువైన వందేవతల మహజాతర ప్రతి రెండు సంవత్సరాల కోసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజు నుండి నాలుగు రోజుల పాటు నిర్వహించడం ఆదివాసీ గిరిజనుల ఆనవాయితీగా వస్తుంది. అయితే ప్రతి ఏటా ఆదివాసీ గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీంతో మహజాతర నిర్వహించిన వచ్చే ఏడాదిని మేడారం మినీ జాతరగా నిర్వహిస్తున్నారు ఆదివాసీ గిరిజన పూజారులు. వందేవతలపై భక్తులకు అపారమైన నమ్మకం ఉండడంతో మినీ మేడారం జాతరకు సైతం భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ ఏడాది మినీ మేడారం నేటి నుండి 15 తేదీ వరకు జాతర జరగనుంది. ఈ జాతరలో మహాజాతర సమయంలో ఎలాంటి పూజలు నిర్వహిస్తారో ఇప్పుడు ఇదే పద్ధతిలో పూజలు నిర్వహిస్తారు. మినీ జాతరకు సరిగ్గా వారం రోజుల ముందు మేడారం గ్రామంలోని సమ్మక్క ఆలయంలో ఆదివాసీ పూజారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదే సమయంలో కన్నేపల్లిలోని సారలమ్మ ఆలయంలో, కొండాయి గ్రామంలో గోవిందరాజులకు, పూనుగొండ్ల లో పగిడిద్ద రాజు ఆలయంలో ఆదివాసీ గిరిజనులు పూజలు చేస్తారు. అదే విధంగా లాస్ట్ బుధవారం రోజు ఆయా ఆయా ఆలయాల్లో పూజారులు గుడిమెలిగె పండుగను నిర్వహించారు. ములుగు గట్టమ్మ వద్ద నాయకపోడు పూజారులు ఎదురుపిల్ల వేడుక నిర్వహించారు. అదే సమయంలో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరకు అంకురార్పణ చేశారు.

**పూజలు మాత్రమే... వనదేవతలు గద్దెలపైకిరారు..**

మినీ మేడారం జాతరలో ఆదివాసీ గిరిజన పూజారులు వనదేవతలకు పూజలు మాత్రమే నిర్వహిస్తారు. మహతర సమయంలో సమ్మక్క, సారలమ్మ, గోవింద రాజులు, పగిడిద్దరాజు ను గద్దెల పైకి తీసుకువైవచ్చి ప్రతిష్టిస్తారు. అయితే మినీ మేడారం జాతరలో సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజు పూజారులు ఆచార సాంప్రదాయాల

...మిగతాది 2 లో

# మావోలపై ముప్పేట దాడి...



**జయభేరి, హైదరాబాద్ ఫిబ్రవరి 12:**

వరుస ఎన్ కౌంటర్లు మావోయిస్టు పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బ తగులుతోంది. మావోయిస్టులకు పట్టున్న ఛత్తీస్ ఘడ్ కేంద్రంగా మావోయిస్టుల ఏరివేత కొనసాగుతుంది. ఏరివేత లో భాగంగా ఎన్ కౌంటర్ లు నిత్యకృతయమయ్యాయి. ఒక ఎన్ కౌంటర్ మరువక ముందే మరో ఎన్ కౌంటర్ జరుగుతుంది. ఎన్ కౌంటర్ జరిగిన ప్రతిసారి పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందుతున్నారు. నిన్న ఆదివారం ఛత్తీస్ ఘడ్, మహరాష్ట్ర సరిహద్దుల్లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో కాల్పుల మోత మోగింది. పోలీస్ బలగాలు, మావోయిస్టుల తూటాలకు 31 మంది మావోయిస్టులు మృతి చెందగా. మృతుల్లో 11 మంది మహిళలు, 20 మంది పురుషులు ఉన్నట్లు తెలిపారు. ఎదురు కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి చెందినట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ ప్రకటనలో తెలిపారు. పక్కా సంచారంతో పోలీస్ బలగాలు నేషనల్ పార్క్ అటవీ ప్రాంతానికి చేరుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున మావోయిస్టులకు, పోలీస్ బలగాలకు మధ్య ఎదురు కాల్పులు మొదలయ్యాయి. మావోయిస్టుల

...మిగతాది 2 లో



# నా స్నేహితుడిని కలవడం చాలా సంతోషంగా ఉంది

**జయభేరి, పారిస్, ఫిబ్రవరి 12:**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. 3 రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వెళ్లగా.. సోమవారం రోజు ఉదయం అక్కడకు చేరుకున్నారు. ఏఐ శిఖరాగ్ర సమావేశానికి ముందుగా ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో సమావేశం అయ్యారు. అలాగే విందులో కూడా పాల్గొన్నారు. అక్కడే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను సైతం కలుసుకున్నారు. అయితే తాజాగా దీనిపై స్పందిస్తూ ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. అందులో తన స్నేహితుడిని కలవడం చాలా సంతోషంగా ఉందంటూ ట్వీట్ చేశారు. మరి ఆ స్నేహితుడు ఎవరో తెలుసుకుందాం.ముందుగా ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ను కలిశారు. ఈక్రమంలోనే ఆయన మోదీని ఆత్మీయంగా కౌగిలించుకున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఏఐ యాక్షన్ సమ్మిట్‌కు ముందు అధ్యక్షుడు మాక్రాన్ ప్రధాని మోదీ, యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో సహా అతిథులకు విందు ఇచ్చారు. ఈక్రమంలోనే ముగ్గురు నాయకులు ఒకరితో ఒకరు సంభాషించుకుంటూ కనిపించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. ప్రధాని మోదీ ఫ్రాన్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అంశం ఏమిటంటే అధ్యక్షుడు మాక్రాన్ ఆయనకు ఇచ్చిన సమయం, గౌరవం. మొదటి రోజు అధ్యక్షుడు మాక్రాన్ ప్రధాని మోదీ ఇచ్చిన విందులో ఆయనతో గడిపారు. మరోవైపు

...మిగతాది 2 లో

# యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు



- నెలాఖరులోగా రోడ్లపై గుంతలు కనిపించకూడదన్న సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో రోడ్లపై గుంతలు కనిపించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు ఆదేశించారు. గతంలో రహదార్లపై ప్రయాణించాలంటే భయమేసేదని, ఇప్పుడు మొదలు పెట్టిన రోడ్డు నిర్మాణ పనులన్నీ 4ఏళ్లలో పూర్తి కావాలని అధికారులను సీఎం ఆదేశించారు.

రాష్ట్రంలో ఎక్కడా కూడా తనకు గుంతలున్న రహదార్లు కనిపించకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గతంలో రహదార్లపైన ప్రయాణించాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఉండేదని, దాన్ని పోగొట్టి ఇప్పుడు మన ప్రభుత్వం రహదార్లను బాగు చేశామని, ఇప్పుడు రోడ్లు కాస్త అందంగా కనిపిస్తున్నాయని, ఇది సంతోషదాయకమన్నారు. అయితే ఇక్కడితోనే మనం ఆగిపోకూడదని సూచించారు. మంత్రులు, కార్యదర్శుల సదస్సులో భాగంగా రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఇచ్చిన ప్రజంటేషన్ పైన సీఎం మాట్లాడారు. జాతీయ రహదార్లపైన కూడా తనకు ఎక్కడా గుంతలు కనిపించకూడదన్నారు. రహదార్లకు మరమ్మత్తులు చేయడం, రోడ్లు నిర్మించడం ఒక్కటే కాదని, వాటి నిర్వహణ కూడా నిరంతరం సమర్థవంతంగా చేయాలన్నారు. ఇప్పుడు మనం చేపట్టిన రోడ్లు నిర్మాణ పనులన్నీ కూడా నాలుగేళ్లలో పూర్తి కావాలన్నారు. అర్బన్ ఏరియాలో కూడా ఎక్కడా

...మిగతాది 2 లో



# చిన్నారులతో కలిసి డిన్నర్ చేసిన మంత్రి సీతక్క

**జయభేరి, హైదరాబాద్:**

సంపాదించిన సంపాదనలో కొంత సమాజ శ్రేయస్సుకోసం వినియోగించాలని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. చిన్నప్పుడే పిల్లల్లో సేవ భావం పెంపొందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. చిన్ననాటి ఉంటే పిల్లల్లో పెద్దలపట్ల సమాజం పట్ల ఎలా నడుచుకోవాలి నేర్పించాలని హితవు పలికారు. హైదరాబాదు జూబ్లీహిల్స్ లోని ఏఎస్ఎఫ్ బిబిక్యూ & గ్రిల్ రెస్టారెంట్ లో ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి ఆమె కాసేపు సరదాగా గడిపారు. వారి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో చిన్నారులతో పాటు మంత్రి పాలుపంచుకొని వారిలో ఆనందాన్ని నింపారు. సామాజిక బాధ్యతగా చిన్నారులకు మంచి రుచికరమైన నాణ్యమైన ఆహారం అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ నిర్వాహకులు కాడ అఖిల్ & ఆరిఫ్ అలీ అన్నారు. చిన్నారుల్లో ఆనందం నింపడమే వన్ ఈవెనింగ్ ఆఫ్ టుగెదర్ అండ్ జాయ్ కార్యక్రమం పేర్కొన్నారు. ఎన్జీవో చెందిన 70 మంది చిన్నారులకు ఆహార అందించడం ఆనందంగా ఉందన్నారు.

# ఏమౌతోంది.. ఈ మనుషలకు...

▶▶ మొదటిపేజీ తరువాయి

## మినీ మేడారం

ప్రకారం పూజలు నిర్వహిస్తారు. భక్తులు వదేవతలకు బంగారం (బెల్లం), పసుపు, కుంకుమతో చీరా చార సమర్పించుకుంటారు. ఎదురుకొళ్లు, మేకలను కూడా వందేవతలకు బలివ్వడం భక్తుల నమ్మకం.మినీ మేడారం జాతరకు 15 లక్షల నుండి 20 లక్షల వరకు భక్తులు తరలితనుండడంతో ములుగు జిల్లా యంత్రాంగం భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర్ తెలిపారు.

**మేడారంలో భక్తుల సందడి**

మేడారం మినీ జాతర సందర్భంగా సమ్మక్క ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంతోపాటు కొండాయిలోని గోవిందరాజులు, పూనుగొండ్ల లో పగిడిద్ద రాజు ఆలయంలో కూడా పూజలు చేశారు. కాగా వన దేవతల దర్శనానికి వచ్చిన భక్తులతో మేడారంలో సందడి నెలకొంది. శివ సత్తుల పూనకాలతో మేడారం సమ్మక్క, సార లమ్మ గద్దెల ప్రాంగణం పులకించిపోయింది. ఇదిలా ఉంటే మేడారం వన దేవతల జాతర సందడి వారం రోజుల ముందు నుంచే ప్రారంభవుతుంది. జాతరకు సరిగ్గా వారం రోజుల ముందు గుడిమెలిగె, మండెమెలిగే పండుగలతో మేడారంలో సందడి సంతరించుకోగా.. ములుగులోని గట్టమ్మ ఆలయం వద్ద నాయక్ పోడు వంశస్థులు ఎదురుపిల్ల పండుగ నిర్వహించి జాతరకు అంకురార్పణ చేసిన విషయం తెలిసిందే. ఇదిలాఉంటే మరో మూడు రోజుల పాటు మేడారం మినీ జాతర జరగనుండగా.. గత మినీ జాతరతో పోలిస్తే ఈసారి ఇంకా ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## మావోలపై ముప్పేట దాడి...

ఏరివేత లో భాగంగా DRG, STF తో పాటు కేంద్ర బలగాలు నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురు పడడంతో ఎదురు కాల్పులు చోటు చేసుకున్నట్టు బస్తర్ ఐజీ తెలిపారు. ఈ ఎన్ ఎన్ కౌంటర్ లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారని, ఎన్ కౌంటర్ స్థలం నుండి AK 47, SLR, INSAS రైఫిల్, 303 ఆయుధాలతో పాటు మావోయిస్టులు తయారు చేసిన రాకెట్ లాంచర్, బిజిఎల్ లాంచర్ ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ ఐజీ తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీన ఛత్తీస్ ఘఢ్ బీజాపూర్ జిల్లాలోని గంగలూరు అటవీ ప్రాంతంలో పోలీస్ బలగాలకు, మావోయిస్టులకు జరిగిన జరిగిన ఎదురు కాల్పుల్లో ఎనమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. మరో ఒకటి నిన్న ఫిబ్రవరి 9వ తేదీన ఛత్తీస్ ఘడ్ నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ భారీ సంఖ్యలో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు.

జనవరి 29 న జార్ఖండ్ రాష్ట్రంలోని చైబాసా, సోమావా పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటన స్థలం నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ లు తెలిపారు. జనవరి 19 వ తేదీన ఒడిశా రాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్ బలగాలకు, మావోయిస్టుల మధ్య మొదలైన ఎదురుకాల్పులు నాలుగు రోజుల పాటు కొనసాగాయి. ఈ ఎన్ ఎన్ కౌంటర్ లో 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్ కౌంటర్ లో మావోయిస్టు పార్టీ కీలక నేతను కోల్పోయింది. కేంద్రకమిటీ సభ్యులు, ఒడిశా రాష్ట్ర కార్యదర్శి చలపతి మృతి చెందారు. జనవరి 16 వ తేదీన ఛత్తీస్ ఘడ్, తెలంగాణ సరిహద్దుల్లోని పూజారి కాంకేర్ అటవీ ప్రాంతంలో పోలీస్ లకు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీస్ లు వెల్లడించారు. 16 వ తేదీన నుండి 17 వ తేది రెండు రోజుల పాటు జరిగిన ఎన్ కౌంటర్ లో మోస్ట్ వాంటెడ్ గా ఉన్న తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దామోదర్ తప్పించుకున్నారు. ఈ ఎన్ ఎన్ కౌంటర్ రెండు రోజులకు మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. పూజారి కంకేర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు లేఖ లో పేర్కొన్నారు. జనవరి 12 వ తేదీన ఆదివారం ఉదయం బీజాపూర్ జిల్లా నేపనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రత దళాలకు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో ఇద్దరు మహిళలు ఉన్నట్లు పోలీస్ తెలిపారు. ఘటన స్థలం నుండి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ లు వెల్లడించారు. జనవరి 5 వ తేదీన నారాయణపూర్, దంతెవాడ జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన లో ఒక జవాన్ మృతి చెందినట్లు పోలీస్ లు ప్రకటించారు. 2025 కొత్త సంవత్సరం ప్రారంభమైన మూడు రోజులకే 3 వ తేదీన ఒడిశా సరిహద్దుల్లో బలగాలకు, మావోల కు జరిగిన ఎన్ కౌంటర్ లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు గారియాబాద్ పోలీస్ లు వెల్లడించారు. మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా కేంద్ర బలగాలు, ఆయా రాష్ట్ర పోలీసులు, మావోయిస్టుల ఏరివేతకు ఏర్పాటు చేసిన బలగాలు సెర్చ్ ఆపరేషన్ ను కొనసాగిస్తున్నాయి. ప్రధానంగా ఛత్తీస్ ఘడ్ అటవీ ప్రాంతాన్ని పోలీస్ బలగాలు దండకారణ్యాన్ని జల్లడ పడుతున్నాయి. దీంతో మావోయిస్టు దళాలు ఎదురు పడడం లేదా పక్క సమాచారంతో బలగాలు మావోయిస్టులను మట్టుపెడుతున్నారు. ఈ సంవత్సరం 2025 జనవరి 3 తేదీన నుండి మొదలైన ఎన్ కౌంటర్లు వరుసగా కొనసాగుతున్నాయి.

## యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

గుంతలున్న రహదార్లు తనకు కనిపించ కూడదన్నారు. కేంద్రం ప్రభుత్వం చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణాలు, రైల్వే నిర్మిస్తున్న రైల్వే వంతెనల నిర్మాణాలు చేపడుతుంటుందని, కేంద్రంతో కూడా సమన్వయం ఏర్పాటు చేసుకుని ఆ పనులు ప్రగతిని కూడా సమీక్షించుకోవాలని, రాష్ట్రంలో కనెక్టివిటీకి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ నెలాఖరులోపు రాష్ట్రంలో ఆర్ అండ్ బీ రహదార్లన్నిటినీ గుంతల రహిత రహదార్లుగా మారుస్తామని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే చెప్పారు. 20,059 కిలోమీటర్ల రోడ్లను గుంతల రహితంగా మార్చాలనే లక్ష్యంలో ఇప్పటికే జనవరి నెలాఖరుకు 14,168 కిలోమీటర్లు గుంతల రహితంగా మార్చామన్నారు. మిగిలింది కూడా ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామం నుంచి మండల కేంద్రం, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రహదారులు వేయాలనే కార్యక్రమం వేగంగా జరుగుతోందన్నారు. 2026 మార్చి నెలాఖరులోపు మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రహదారుల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

గ్రామాల్లో రహదారుల మరమ్మతులు, నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు ఒక సవాల్ వంటిదన్నారు. మంత్రులు, కార్యదర్శుల సదస్సులో పంచాయతీరాజ్ శాఖ ప్రజంటేషన్‌పైన ఆయన స్పందిస్తూ నరేగా నిధులు సమర్ధవంతంగా వినియోగించుకోవాలన్నారు. ఈ నెల, వచ్చే నెల ఎంతమేర పనులు చేస్తారో ఆ మేరకు పూర్తి చేయాలన్నారు. వచ్చే సంవత్సరం లక్ష్యాలను మరింత పెంచుకుని పనిచేయాలని సూచించారు. డ్వాక్రా సంఘాలు గత ప్రభుత్వ నిర్వాకం వల్ల నిస్తేజంగా మారాయని తెలిపారు. మూడు దశాబ్దాల చరిత్ర మన డ్వాక్రా సంఘాలకుందని వివరించారు. ఒకప్పుడు మన డ్వాక్రా సంఘాల మహిళలు హిందీ భాష రాకపోయినా ఇతర రాష్ట్రాలకు వెళ్లి డ్వాక్రా ఫిలాసఫీ బోధించి వచ్చిన సందర్భాలున్నాయని అయితే ఇప్పుడు ఆ స్ఫూర్తి సంఘాల్లో లోపించిందన్నారు. డ్వాక్రా సంఘాలు తీసుకుంటున్న రుణాలు ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. వివిధ పథకాల కింద డ్వాక్రా సంఘాలకు రూ.50 వేల కోట్ల లింకేజీ పెడుతున్నామని, అలాంటప్పుడు ఈ సంఘాల పనితీరు మెరుగుపరిచేలా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఆయా డ్వాక్రా సంఘాల్లో ఏఏ నైపుణ్యాలున్నాయి, వారు చేసే వ్యాపారం ఎలా ఉంది తదితర అంశాలన్నీ బేరీజు వేసి వారిలో మళ్లీ చైతన్యం తీసుకొచ్చి సత్ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు అభివృద్ధి చ ఎందకపోతే ఎప్పటికీ పేదరికం రూపుమాపలేమని ఈవిషయాన్ని అధికారులు గుర్తించి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు.

## చాలా సంతోషంగా ఉంది

ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. అందులో ఫ్రాన్స్ అధ్యక్షుడు, తన స్నేహితుడు అయిన ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ను కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ఆయనను ఆలింగనం చేసుకున్న ఫొటోతో పాటు ఆత్మయంగా మాట్లాడుతున్న ఫొటోను షేర్ చేశారు. దీంతో పాటే మరో పోస్ట్ పెట్టిన మోదీ.. అక్కడి ప్రజలు మర్చిపోలేని స్వాగతాన్ని పలికారని చెప్పారు. భారత ప్రవాసులకు కృతజ్ఞతలు చెబుతూనే.. వారి విజయాల పట్ల గర్వంగా ఉందని వెల్లడించారు. స్నేహానికి ఒక అసాధారణ చిహ్నంగా, వారు ఉమ్మడి మోటారుకేడ్‌లో, ఒకే విమానంలో మార్సెయిల్‌కు ప్రయాణించారు. అధ్యక్షుడు మాక్రాన్ ప్రధాని మోదీ దిగిన వెంటనే మార్సెయిల్‌లో వర్కింగ్ డిన్నర్‌కు ఆతిథ్యం ఇచ్చారు. మాక్రాన్ లాంటి నాయకుడు ఏ ప్రపంచ నాయకుడికైనా ఇంత సాన్నిహిత్యం, సమయం ఇవ్వడం చాలా అరుదు అని అన్నారు మోదీ.

# ఏమౌతోంది.. ఈ మనుషులకు...

> ఈ భూమ్మీద అత్యంత క్రూరమైన జంతువుగా మారగలిగేది ఒక్క మనిషి మాత్రమే. రెండు కాళ్లతో పుట్టి నాలుగు కాళ్ల జంతువుగా మారేది మనిషి ఒపాతికేళ్ల కుర్రాడి నుంచి యాభై ఏళ్ల బామ్మదాకా అందరిలో విలనిజం వెర్రితలలు వేస్తోంది నేరాలకు కారణం ఏంటని.. దాని మూలాలను వెతుకుతూ వెళ్తే కనిపిస్తున్న అడ్రస్ 'ఇల్లు'. నానమ్మ కళ్లలో ఆనందం కోసం చెల్లెలి భర్తనే చంపేశారు. వయసుమళ్లిన తరువాత శాంతంగా, ప్రశాంతంగా ఉండాల్సిన నాయనమ్మే.. మనవళ్లకు పగను నూరిపోయడం వల్ల జరిగింది కాదా ఆ ఘోరం..!



వంద మంది అమ్మాయిలను అనుభవించడమే లక్ష్యమట. ఆ టార్గెట్ మరిచిపోకుండా ఉండేందుకు ఏకంగా పచ్చబొట్టు పొడిపించుకున్నాడు ఛాతి మీద. హత్య చేయడానికి, అత్యాచారం చేయడానికి, కన్నవాళ్లనే చిదిమేయడానికి, కట్టుకున్నవాళ్లనే అంతమొందించడానికి.. వీటన్నింటికీ కారణాలున్నాయ్. మనిషి మృగంగా ఎప్పుడు, ఎందుకు మారతాడనడానికి కొన్ని లెక్కలున్నాయి. ఆస్తి ఇవ్వలేదని తాతను పొడిచాడు. ఒక్కసారి కాదు 73 సార్లు పొడుస్తూనే ఉన్నాడు కసిగా. తల్లి అని కూడా చూడకుండా అడ్డొచ్చిన ఆమెపైనా కత్తితో పొడిచేశాడు. మనిషిలో మానవత్వం మాయమవుతోందని చెప్పడానికి ఇదే అతిపెద్ద నిదర్శనం. అసలు.. మానవత్వం మానవత్వం అని గొంతుచించుకుంటూ అరుచుకుంటూ వెళ్తున్నాం గానీ.. కనీసం పశుత్వం అయినా మనిషిలో ఉందా అనేదే అనుమానం. భార్యను ముక్కలుముక్కలుగా నరికి, కుక్కర్‌లో ఉడికించి, ఎముకలు పొడి చేసి, చెరువులో పడేశాడట. మనసులో ఎంత పశుత్వం ఉంటే అంత పనిచేయగలడు. మానిప్యులేటర్స్ అనే పదాన్ని ఈమధ్య క్రైమ్‌లో కూడా వాడుతున్నారు. సైకాలజిస్టులు క్యాటగరైజ్ చేసిన సైకో మెంటాలిటీస్.. ఈ మానిప్యులేటర్స్. ఎలా ఉంటారంటే వీళ్లు.

మాటలతోనే మత్తుజల్లుతుంటారు. ఎదుటివారిని నమ్మించగలిగినప్పుడే మోసం చేయొచ్చు. అత్యంత దారుణాలు జరిగేది కూడా నమ్మిన వాళ్ల దగ్గరే. ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఓ అమ్మాయిని.. తనపై నమ్మకం పెరిగేంతగా నటించాడు ఓ యువకుడు. ఇంట్లో ఫంక్షన్ ఉందని చెప్పి, ఆ అమ్మాయిని రప్పించాడు. ఇంట్లో ఫంక్షన్ జరగడం లేదని తెలిసినా సరే.. అక్కడే తన కాలేజ్‌లో చదువుతున్న మరో యువకుడిని చూసి ఏం కాదులే అని నమ్మిందా అభాగ్యురాలు. ఆ నమ్మకమే, అలా నమ్మడం వల్లే ఆ తరువాత నరకం చూసింది. పిలిచిన వ్యక్తి ప్లస్ ఆ తోటి విద్యార్థి.. ఇద్దరూ బయట కాపలాగా ఉంటే.. మూడో వ్యక్తి వచ్చి అత్యాచారం చేశాడు. పైగా ఆ అరుపులు బయటకు వినించకుండా సౌండ్ బాక్సులు పెట్టారట. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలలో జరిగిందీ దారుణం.ఆడపిల్లల జీవితాలతో మస్తాన్ సాయి ఆడుకుంటూపోయాడని చెబుతున్నారు మానసిక వైద్యులు. ప్రభాకర్ అనే సైకోమెంటాలిటీ ఉన్నవాడిని ఈ మధ్యే చూశాం. వంద మంది అమ్మాయిలే టార్గెట్ అట. ఎంత మానిప్యులేటర్ కాకపోతే.. అంతమందిని లక్ష్యంగా పెట్టుకుంటాడు. మాటలు, మంచితనాన్ని అడ్డుపెట్టి ఎంతమంది అమ్మాయిలను నమ్మించి మోసం చేసి ఉంటాడు. మీర్‌పేటలో భార్యను కిరాతకంగా చంపిన గురుమూర్తినే చూడండి. ఆ చుట్టుపక్కల ఎవరిని అడిగినా సరే.. 'అరె.. అతను చాలా మంచివాడే, ఇలా ఎలా చేశాడు, అసలు అంత దారుణమైన పని చేస్తాడని ఊహించనే లేదు' అనే చెప్తారంతా. హీ ఈజ్ ఆల్సో ఏ వెరీ గుడ్ మానిప్యులేటర్.ఇదనే కాదు.. చిన్న పిల్లల పై, మైనర్లపై అఘాయిత్యాలు చేసేది అలా నమ్మించే వాళ్లే. అన్న కదా, అక్కా అని పిలిచాడు కదా, బాబాయ్, పెదనాన్న, తాతే కదా అని నమ్మకంతో వెళ్లినందుకు ఎంతమంది ఆడపిల్లలు బలైపోతున్నారో. ఆ పశుప్రవృత్తికి కారణం.. 'విషయం బయటకు తెలిస్తే తమ పరువే పోతుందని స్వయంగా తల్లిదండ్రులే భయపడడం'. కామాంధుల బలం కూడా అదే. బయటకు చెప్పుకోలేరు అనే అస్త్రాన్ని ప్రయోగించి.. అయినవాళ్లనే, వావివరసలు మరిచి ప్రవర్తిస్తుంటారు. కొన్ని గణాంకాలు కూడా ఉన్నాయ్. ఎన్సీఆర్బీ 2016 రిపోర్ట్ ప్రకారం మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార కేసుల్లో.. 94 శాతం దోషులు ఆ కుటుంబానికి బాగా తెలిసిన వాళ్లు, దగ్గర వాళ్లే. ఆ దోషులలో 29 శాతం మంది ఇరుగుపొరుగు వాళ్లు, 27 శాతం పెళ్లి చేసుకుంటామని హామీ ఇచ్చిన వాళ్లు, 6 శాతం బంధువులు, మిగతా 30 శాతం ఆ కుటుంబానికి చాలా దగ్గరగా ఉండేవాళ్లు. సో, ఒక్కోసారి నమ్మకమే ప్రమాదకరం. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఇద్దరు పసిపిల్లలను కొట్టిన తీరు చూసి.. వైద్యం చేసిన డాక్టర్లే కన్నీళ్లు పెట్టుకున్నారు. అంతలా కొట్టడానికి మనసెలా వచ్చిందని. పిల్లల్ని అలా కొట్టడానికి కారణం ఏంటో తెలుసా. వివాహేతర సంబంధం. తన వ్యవహారానికి పిల్లలు అడ్డొస్తున్నారని ఫోన్ ఛార్జర్ వైర్‌తో కొడుతుంటే.. చర్మం చిరిగిపోయి, రక్తం బయటకు చిమ్మింది. అక్కడితో ఆగలేదు. ఆ గాయాలపై కారం పూశారట. 9 ఏళ్ల బాలుడు అనుభవించిన టార్చర్ వింటే ఎవరికైనా కన్నీళ్లొస్తాయ్. ఆ బాలుడి చెల్లెలు.. వయసు ఐదేళ్లుంటాయి.. ఆ చిన్నారిని కూడా వాతలు తేలేలా కొట్టాడు. ఆ అడ్డమైన సంబంధానికి పిల్లలు అడ్డొస్తున్నారన్న కోపంతో చేసిన దుర్మార్గం ఇది.జాతివైరాన్ని మరిచిన జంతువులు' అని ఒక్కోసారి కొన్ని వీడియోలు చూస్తుంటాం. లేడిపిల్ల దగ్గరకు వచ్చినా సరే పులి ఏమీ చేయకుండా దాన్ని నాకుతూ ఉంటుంది ఆప్యాయంగా. అలాంటిది కడుపున పుట్టిన వారినే దయా దాక్షిణ్యాలు లేకుండా ప్రవర్తిస్తున్న తల్లిదండ్రులున్నారు. 14 ఏళ్ల కొడుకుపై పిడిగుద్దులు కురిపించాడో తండ్రి. ఛాతిపై తట్టుకోలేనంత తీవ్రతతో పిడికిలి బిగించి మరీ బాదాడు. అంత దెబ్బ తగిలితే పిల్లాడు ఉంటాడా. అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఇంత దారుణంగా ప్రవర్తించడానికి కారణం.. తన కొడుకు రాత్రి 8 అయినా ఇంటికి రాకపోవడం. 'నాన్నా స్కూల్లో ఫేర్‌వెల్ పార్టీ జరిగింది.. కాస్త ఆలస్యం అయింది' అని చెబుతున్నా వినకుండా కొట్టడంతో తొమ్మిదో తరగతి చదివే ఆ బాలుడు అక్కడికక్కడే చనిపోయాడు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిందిది. తెలంగాణనే చూద్దాం. ఒక్క ఏడాదిలోనే కుటుంబ కలహాలతో 229 హత్యలు జరిగాయి. వివాహేతర సంబంధాల కారణంగా 102 హత్యలు, చిన్నచిన్న గొడవల కారణంగా 82, ఆర్థిక వివాదాలతో 53 హత్యలు జరిగాయి. గతేడాది మహిళలపై జరిగిన నేరాలే.. 19వేల 922. వీటిలో సగం వరకట్న వేధింపులే. ఇక అత్యాచార కేసులలో 99.2 శాతం నిందితులు బాధితులకు తెలిసినవారే చేశారంటున్నారు తెలంగాణ పోలీసులు.ఓవైపు.. కఠిన శిక్షలు ఉన్నా, మరణశిక్షలు విధిస్తున్నా సరే.. ఈ అత్యాచారాలు మాత్రం ఆగడం లేదు. 2012లో నిర్భయ ఘటన జరిగాక.. అత్యాచారాలకు అత్యధికంగా మరణశిక్ష కూడా విధించొచ్చు అంటూ చట్టంలో మార్పులు చేశారు. ఈ శిక్షతో నేరస్తులు భయపడిపోతారని అనుకున్నారంతా. కానీ జరిగిందేమిటో తెలుసా. 2015లో 34వేల 651 అత్యాచార కేసులు, 2016లో 38వేల 947 అత్యాచార కేసులు రిజిస్టర్ అయ్యాయి. 2012లో.. అంటే నిర్భయ ఘటన జరిగిన ఏడాదిలో.. 24వేల 923 సంఘటనలే జరిగాయి.

అంటే.. ఉరిశిక్ష పడుతుందన్న భయం కూడా లేదని తేలిపోయింది. పైగా ఇలా అత్యాచార బాధితుల్లో ఎక్కువగా పిల్లలే ఉన్నారు. పోక్సో లాంటి పవర్‌ఫుల్ చట్టం ఉన్నప్పటికీ.. కేవలం 3 శాతం కేసులలో మాత్రమే నేరాలుగా నిరూపించగలిగారు. NCRB రిపోర్ట్ ప్రకారం.. 2016లో పిల్లలపై అత్యాచారాలకు సంబంధించి 64వేల 138 కేసులు పోక్సో చట్టం కింద నమోదైతే.. కేవలం 3 శాతం కేసులనే నిరూపించగలిగారు. నేరమే నిరూపించలేకపోయినప్పుడు ఎవరిని ఉరి తీస్తారు? వీటన్నింటికీ కారణం ఏంటని అడిగితే.. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవడమే అనే సమాధానమే ప్రధానంగా వినిపిస్తోంది. పిల్లల్ని పెంచే పద్ధతిలోనే ఏదో లోపం జరుగుతోంది.

అటుపైన ప్రతి ఇంట్లోకి వేగంగా దూసుకొచ్చిన ఇంటర్నెట్. ఏ నేరం ఎలా చేయాలో, ఎలా చేస్తే తప్పించుకోవచ్చో చెప్పే సినిమాలు సెల్‌ఫోన్ నిండా ఉన్నప్పుడు.. టెస్టోస్టెరాన్ స్థాయిని పెంచే ఘాటైన వీడియోలు కళ్లముందే కదలాడుతున్నప్పుడు.. ఇక నేరాలు జరక్కుండా ఉంటాయా? అయినా లోపం.. ఇంటర్నెట్‌తో, రెచ్చగొట్టే వీడియోలది మాత్రమే కాదు. సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న తీరులోనే లోపం ఉంది. యూరప్‌లోని కొన్ని దేశాల్లో జైళ్లనే ఎత్తేశారు. కారణం.. అక్కడ నేరాలు జరక్కపోవడమే. అంటే ఏంటీ అర్థం. మనిషి సంతృప్తిగా జీవించినప్పుడు, ఆ మనిషి సంతృప్తికరంగా జీవించేలా ప్రభుత్వాలు సమాజాన్ని నిర్మించినప్పుడు మాత్రమే నేరాల కట్టడి సాధ్యం. ఉరివేయాలి, మెడలు కోయాలి, బహిరంగంగా తగలబెట్టాలి.. ఇలాంటి శిక్షలు సైతం మనిషిని మార్చలేవు. సో, సమాజం మారాలంటే.. అటు ప్రభుత్వాలు కూడా జీడీపీ ఆధారంగా కాకుండా హ్యాపీనెస్ ఇండెక్స్ కొలమానంగా పాలించాలంటున్నారు విశ్లేషకులు. మరి.. అలాంటి రోజులు ఎప్పుడొస్తాయో, ఎప్పుడు చూస్తామో..!

# శృతిమించిన ర్యాగింగ్.. ప్రైవేట్ పార్ట్స్ కు డంబెల్..

✍ జయభేరి, తిరువనంతపురం, ఫిబ్రవరి 12:

కేరళలోని కొట్టాయం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో విద్యార్థుల వేధింపులకు సంబంధించిన దారుణమైన ఘటనలు వెలుగులో వస్తున్నాయి. కాలేజీలో చదివేందుకు వచ్చే జూనియర్లపై విచక్షణ మరిచి చిత్ర హింసలకు గురి చేసిన సీనియర్ల వేధింపులు దేశవ్యాప్తంగా ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ర్యాగింగ్ పేరుతో.. జూనియర్ల ప్రైవేట్ పార్టుల్లోకి ఏకంగా జిమ్ చేసే డంబుల్స్ దూర్చుతూ.. రాక్షసంగా ప్రవర్తించిన ఘటనలు ఆశ్చర్యపరుస్తున్నాయి.. దువుకునేందుకు వచ్చిన విద్యార్థులు.. అసభ్యకరంగా, విచక్షణ లేకుండా ప్రవర్తించడాన్ని తీవ్రంగా తప్పుపడుతూ.. ఈ తీవ్ర చర్యలకు పాల్పడిన విద్యార్థులపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతుంది. దీంతో.. వేధింపులకు కారణం అయిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు.

కొట్టాయంలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో చదువుకునేందుకు అడుగుపెట్టిన జూనియర్లకు సీనియర్ల నుంచి వేధింపులు ఎదురవుతున్నాయి. అప్పడే కాలేజీలో అడుగుపెట్టిన సీనియర్ల నుంచి ఎవరైనా సలహాలు, సూచనలు కోరుకుంటారు. తమ తర్వాత వచ్చిన వారికి సరైన కెరీర్ ఎంచుకునేందు తోడ్పడాలి. కానీ.. ర్యాగింగ్ పేరుతో తీవ్ర భౌతిక, మానసిక దాడులకు పాల్పడుతున్నారు కొందరు విద్యార్థులు. పరిధి దాటనంత వరకు ఏదైనా బాగానే ఉంటుంది. కానీ.. ర్యాంగింగ్ పేరుతో ఏకంగా జూనియర్ విద్యార్థులపై దాడులకు పాల్పడడంతో అంతటా ఆగ్రహం వ్యక్తం అవుతుంది.ఈ పాలిటెక్నిక్ కాలేజీలో మూడో ఏడాది చదువుతున్న ఐదుగురు విద్యార్థులు.. జూనియర్లపై దారుణంగా ప్రవర్తిస్తున్నారు. జూనియర్లను బట్టలు ఇప్పించి మారీ వేధిస్తున్నారు. వారి ప్రైవేట్ పార్టుకు బలవంతంగా డంబుల్స్ వేలాడదీశారు. జామెట్రీ బాక్స్ లోని కంపాస్ లతో విద్యార్థులను గాయపరుస్తున్నారు. వీరి ప్రవర్తనకు అనేక మంది జూనియర్లు దారుణంగా గాయపడ్డారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా ఈ దారుణాలు కొనసాగుతుండగా, వేధింపులు తాళలేక విద్యార్థులు పోలీసుల్ని ఆశ్రయించారు. దాంతో.. వీరి క్రూరత్వం గురించి బయటి ప్రపంచానికి తెలిసింది. విద్యార్థుల్ని వివిధ శిక్షల పేరుతో తీవ్రంగా గాయపరిచిన సీనియర్ విద్యార్థులు.. వారికి గాయలైనప్పుడు సైతం దారుణంగా ప్రవర్తించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో జూనియర్ విద్యార్థులు పేర్కొన్నారు. గాయల దగ్గర లోషన్ రాసి మంటపుట్టేలా చేసేవారని, వారు నొప్పితో ఏడుస్తుంటే.. సీనియర్లు నవ్వుకునే వారంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. కొన్ని సార్లు గాయాలకు రాసుకునే లోషన్ ను నోట్లో బలవంతంగా పోసేవారని.. ఆ ఘటనలన్నింటినీ చిత్రీకరించి.. ఎవరికైనా బయటకు చెబితే ఆ వీడియోలు బయటపెడతామని బెదిరించే వాళ్లని తెలిపారు. అక్కడ జరిగే ఘటనల గురించి చెబితే, జూనియర్లు చదువుకోకుండా చేస్తామని, ఒక్కరు కూడా కాలేజీలో ఉండరంటూ తీవ్రంగా భయపెట్టేవారని తెలిపారు అలాగే.. ప్రతీ ఆదివారం నాడు సీనియర్లు మందు పార్టీ చేసుకుంటారని తెలిపిన విద్యార్థులు.. దానికయ్యే ఖర్చును జూనియర్లు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చేవారని చెప్పారు. అందుకు ఎవరైనా అంగీకరించకుంటే.. వారికి తీవ్రంగా కొట్టేవారని, ఇంకా అనేక చిత్రహింసలకు గురిచేసే వారంటూ తెలిపారు. ఈ వేధింపులు భరించలేక ఓ విద్యార్థి.. అతని తండ్రికి విషయం చెప్పగా, ఆయన ప్రోద్భలంతో విద్యార్థులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ధైర్యం చేశారు.పోలీసులకు ఇచ్చిన కంప్లైంట్ లో అనేక ఆశ్చర్యకరమైన, దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి రావడంతో.. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఈ ఘటనపై సత్వరమే స్పందించిన పోలీసులు.. నిందితులైన విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఐదుగురు విద్యార్థులపై ర్యాగింగ్ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. వీరిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. కాగా.. కొచ్చిలో 15 ఏళ్ల పాఠశాల విద్యార్థి ఆత్మహత్య ఘటన తర్వాత ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. కొచ్చిలో మరణించిన విద్యార్థి.. తన సీనియర్లు వేధించడం వల్లే చనిపోయాడంటూ అతని తల్లి ఆరోపించింది.



# యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

- వరంగల్ లో ఉత్సాహభరితంగా 2కే రన్
- డ్రగ్స్ నిర్మూలనపై టీఎస్ జెయు పోరాటం అభినందనీయం
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా

**జయభేరి, వరంగల్, ఫిబ్రవరి 12 :**




యువత సరదాగా డ్రగ్స్ అలవాటు చేసుకొని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్ జెయు) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పోచం మైదాన్ చౌరస్తా నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ జా, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, ఎన్ యు జె (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ లతో కలిసి జెండా ఊపి 2కే రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారికి బానిసలై యువత జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. సరదాగా కిక్ కోసమో, థ్రిల్ కోసమో మొదలయ్యే మత్తు మందుల అలవాట్లు యువత పాలిట శాపాలుగా మారుతున్నాయన్నారు. డ్రగ్స్ విషవలయంలో చిక్కుకుంటున్న యువత భవిష్యత్ సర్వనాశనం అవుతోందన్నారు. డ్రగ్స్ వ్యసనాలను వదులుకోలేని కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని బయట పడేసేందుకు సామాజిక సంస్థలు తమవంతుగా కృషి చేయాలని సూచించారు. ఇందులో భాగంగా టీఎస్ జెయు చేస్తున్న కృషిని కొనియాడారు.

వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి యువత భవితవ్యాన్ని ఛిన్నాభిన్నం చేస్తోందన్నారు. దేశ అభివృద్ధికి తోడ్పడాల్సిన విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి వారి జీవితాలను చిత్తు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని జన్మలకంటే మానవజన్మ ఎత్తడం అదృష్టమన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థానాలకు రావాలని కలలు కనాలి, వాటిని నిజం చేసుకోవడానికి అనునిత్యం కృషి చేయాలన్నారు. కానీ కొందరు డ్రగ్స్ మహమ్మారి ఊబిలో చిక్కుకోవడం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ప్రభుత్వం డ్రగ్స్ సరఫరా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటుందని గుర్తు చేశారు.

టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి మన రాష్ట్రంతో పాటు ప్రపంచాన్ని గడగడలాడిస్తోందని అన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడి ఎన్నో కుటుంబాలు నాశనం అవుతున్నాయన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల మన మానసికంగా, శారీరకంగా కుంగుబాటుకు లోనవుతామని తెలిపారు. డ్రగ్స్ వల్ల జీవితాలు రోడ్డున పడతాయని అన్నారు. డ్రగ్స్ అలవాటు పడిన వారు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యుల జీవితాలు సైతం రోడ్డు పడతాయన్న విషయం గురించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు జీవితంలో ఎదిగి మంచి కుటుంబంతో సంతోషంగా బతకాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డ్రగ్స్ నిర్మూలన కోసం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోటి మందిని చైతన్యవంతం చేయాలని లక్ష్యంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా వరంగల్ ప్రారంభించిన ఈ ఉద్యమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరిస్తామని చెప్పారు. దశలవారీగా అన్ని జిల్లాలలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులుగా కేవలం వార్తలు రాసేందుకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతగా ప్రభుత్వానికి మద్దతుగా డ్రగ్స్ వినియోగంపై టిఎస్ జెయు ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం తెస్తున్నామన్నారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వ సంస్థల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి అతిథులను స్వాగతించి శాలువా మెమొంటోతో సత్కరించడం జరిగింది. కార్యక్రమంలో వరంగల్ ఏసిపి నందిరాం నాయక్, వరంగల్ ఎమ్మార్వో ఎండి ఇక్బాల్, కెఎంసి ప్రిన్సిపల్ రామ్ కుమార్ రెడ్డి, సిఐ లు షుకూర్, తుమ్మ గోపి, జూపల్లి వెంకటరత్నం, ఒంటేరు రమేష్, ట్రాఫిక్ సిఐ రామకృష్ణ, నార్కోటిక్ సీఐ రవీందర్, వరంగల్ డిపిఆర్ఓ అయూబ్ ఆలి, డిప్యూటీ డిఎంహెచ్ఓ హరిసింగ్, ఎన్.సి.సి అధికారి కెప్టెన్ డా సతీష్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, కాకతీయ మెడికల్ కళాశాల జూడ అసోసియేషన్ బాధ్యులు, టీఎన్జీవోస్ బాధ్యులు రాజేష్, లయన్స్ క్లబ్ సభ్యులు రాజగోపాల్, మరియు యువజన సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు. ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అన్ని వర్గాల వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ములుగు జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి రాజు వర్ధన్, రంజిత్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, జనగామ జిల్లా అధ్యక్షులు నరేందర్ మరియు సభ్యులు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల టిఎస్ జేయు యూనియన్ బాధ్యులు ముత్యం ముఖేష్ గౌడ్, మహమ్మద్ రియాజ్, జి ఆంజనేయులు, మెరుగు విష్ణుమోహన్ పాల్గొన్నారు. రాష్ట్ర కమిటీ బాధ్యతలు తోకల అనిల్ కుమార్ నాగపురి నాగరాజు రావుల నరేష్ వరంగల్ జిల్లా కమిటీ బాధ్యులు కందికొండ మోహన్ ఆవునూరి కుమారస్వామి లింగబత్తిని కృష్ణ కందికొండ గంగరాజు ఈద శ్రీనాథ్ బత్తుల సత్యం నీరుటి శ్రీహరి కొడగాని మోహన్ రావు అడప అశోక్ అవినాష్ భాగ్య రాజు సురేష్ కమల్ రాజు తదితరులు పాల్గొన్నారు.






## నిరంతర సేవకుడు మాజీ కార్పొరేటర్ దొంతిరికి ఘన సన్మానం

- పీర్జాదిగూడ 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ప్రజా నాయకుడు, నిరంతర సేవకుడు దొంతిరి హరిశంకర్ రెడ్డికి ఘన సన్మానం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర తొలి మేయర్ జక్క వెంకట్ రెడ్డికి ఘన సన్మానం
- ఐదు సంవత్సరాలు పూర్తి ఐనా సందర్భంగా సన్మానించిన వెస్ట్ క్రాంతి కాలనీ కల్చరల్ అశోషియేషన్ సభ్యులు

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ గా దొంతిరి హరిశంకర్ రెడ్డి 5 సంవత్సరాల పదవి కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా వెస్ట్ క్రాంతి కాలనీ కల్చరల్ అశోషియేషన్ అధ్యక్షులు భక్తిశ్వర్, కార్యదర్శి కళ్యాణ్ కుమార్, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఆత్మీయ గౌరవ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి దొంతిరి హరిశంకర్ రెడ్డిని, జక్క వెంకట్ రెడ్డి గారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం, డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం ప్రజలందరికి అందుబాటులో వుంటూ, డివిజన్ అభివృద్ధి కి కృషి చేసి, ఆత్మీయ సేవకుడు 25వ డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చి దిద్దినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవలు చేయాలని పలువురు ఆకాంక్షించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ.. 25వ డివిజన్ లోని కాలనీ ల ప్రజలకు సేవ చేసే అదృష్టం, నిరంతరం కాలనీ ప్రజలు అందుబాటులో ఉంటానని, భవిష్యత్తులో మీ వెంటే ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమం డివిజన్లోని సాయి హిల్స్,శ్రీ సాయి నగర్, విహారిక, క్రాంతి కాలనీ అధ్యక్షకార్యదర్శులు, కాలనీ వాసులు, పెద్దలు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడిపల్లి మండలం లో సిపిఐ పార్టీ 2025 సభ్యత నమోదు కార్యక్రమం




**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి మండలం పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భగత్ సింగ్ నగర్ కాలనీలో సిపిఐ పార్టీ 2025 సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమమును సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డి.జి సాయిల్ గౌడ్ మరియు జిల్లా సహాయ కార్యదర్శిలు జి దామోదర్ రెడ్డి మరియు ఉమా మహేష్ లో పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మీరు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాలు జరుపుకోవడం భారతదేశంలోనే మొట్టమొదటి పార్టీని అని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ముఖ్యంగా కార్మికులకు, కర్షకులకు బడుగు బలహీన వర్గాల కోసం 100 సంవత్సరాల నుంచి పోరాటాలు చేస్తూ శ్రామికుల కోసం కర్షకుల కోసం వారి హక్కుల కోసం పోరాడుతూ 100 వసంతాలు పూర్తి చేసుకోవడం జరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో ఇంకా భారతదేశంలో ఉన్న అన్ని వర్గాల కోసం వారి హక్కుల కోసం పోరాటాలు నిరంతరం చేస్తాము అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు జె లక్ష్మి, మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు వి.బి బాలరాజ్, కే ప్రమీల, సిహెచ్ మాధవి, కే మహాలక్ష్మి, బి ఐలయ్య, బాపరాజు, ఇస్తారి, సోమరాజు, బొందయ్య, ఉప్పలయ్య, మహేశ్వరి, జ్యోతి, నీలిమ, అండాలు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి



**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 12:**

హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం నడికుడ మండల కేంద్రంలో ఇటీవలే మృతిచెందిన చెందిన బిఆర్ఎస్ నాయకులు తోర్నే శంకర్ రావు, నెమరుగొమ్ముల లక్ష్మణ్ రావు కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించి ఓదార్చారు. అనంతరం వారిరువురి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే చల్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళన బాటలో హలీం నిర్వాహకులు

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 12:**

హైదరాబాద్‌లో హలీం నిర్వాహకులు ఆందోళన చేపట్టారు. తాము ఎంతో కష్టపడి ఏర్పాటు చేసుకున్న హలీం బట్టీలను కూల్చివేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ సిబ్బందిపై హలీం నిర్వాహకులు మండిపడుతున్నారు. అన్ని అనుమతులు తీసుకునే హలీం స్టాళ్లు నిర్వహిస్తున్నామని, ఇలా చేసి మా పొట్ట కొట్టవద్దంటూ ప్రాధేయపడుతున్నారు. రంజాన్ వస్తుందంటే చాలు.. ఎప్పుడెప్పుడు ఆస్వాదిద్దామా అని హలీం ప్రియులు ఎదురుచూస్తుంటారు. రంజాన్ మాసం ముస్లింలకు ఎంత ప్రత్యేకమైందో.. హలీం మీద ఉన్న ఇష్టం కూడా అంతే స్థాయిలో ఉంటుంది. జనాలు అంతగా ఇష్టపడే హలీంకి సంబంధించిన వ్యాపారాన్ని తమకు కాకుండా చేసి ఇలా ఇబ్బందులు పెడుతున్నారని హలీం నిర్వాహకులు చెబుతున్న మాట. నగరంలోని బంజారాహిల్స్ సలీంనగర్‌లో కొందరు హలీం నిర్వాహకులు రోడ్డెక్కారు. తమకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా హలీం బట్టీలను కూల్చివేశారని మండిపడుతున్నారు. గత 30 ఏళ్లుగా ఇక్కడే హలీం విక్రయాలు సాగిస్తున్నామని, ఇదే తమ జీవనాధారమని ఇప్పుడు కొత్తగా ఇలా తమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయడం సరికాదని అంటున్నారు.



## అన్నమాచార్య కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగల పై అవగాహన సదస్సు

**జయభేరి, రాజంపేట:**

కేంద్రంలోని స్థానిక అనమాచార్య యూనివర్సిటీలో బుధవారం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బి.టెక్ తర్వాత ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై విజ్ఞాన భరితమైన అవగాహన సదస్సు నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలోని స్మార్ట్ క్లాస్ రూమ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ రంగంలో స్థిరమైన ఉద్యోగానికి ఆసక్తి చూపుతున్న విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా న్యూ బోయనపల్లి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇంజనీరింగ్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల గురించి ప్రాముఖ్యతను వివరించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో జాబ్ సెక్యూరిటీ, జీతభత్యాలు, కెరీర్ పురోగతి, సామాజిక గౌరవం వంటి ప్రయోజనాలను ఆయన వివరించారు. ప్రభుత్వ రంగం మరియు ప్రైవేట్ రంగం మధ్య తేడాలను తెలియజేస్తూ, విద్యార్థులకు సరైన కెరీర్ ఎంపిక చేసుకోవడానికి సహాయపడేలా ప్రసంగించారు. ఈ సదస్సులో యూపీఎస్సీ, రైల్వేలు, ఇస్రో డిఆర్డిఓ, ఎస్ఎస్సి ,బ్యాంకింగ్, మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు వంటి విభాగాల్లో అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అర్హత ప్రమాణాలు, ఎంపిక విధానం, మరియు సమర్థవంతమైన సన్నద్ధతా వ్యూహాల గురించి విద్యార్థులకు మార్గదర్శనం అందించారు. అలాగే ప్రిన్సిపాల్ డా. ఎస్ఎంవి నారాయణ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ విద్యార్థులు చదువుకునే సమయం నుంచే ఉద్యోగాలు మరియు వ్యాపార అవకాశాల గురించి మరియు పోటీ పరీక్షల గురించి అవగాహన పెంపొందించుకోవాలని వివరించారు. అలాగే సివిల్ హెచ్ఓడి డా. టి. నరేష్ కుమార్ మాట్లాడుతూ మేనేజర్ నాగరాజు ఇచ్చిన ప్రాక్టికల్ సూచనలు, ఇంటరాక్టివ్ సెషన్ ఈ కార్యక్రమాన్ని మరింత ప్రయోజనకరంగా మార్చాయని వివరించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ అధ్యాపకులు డా. . ఎస్ఎంవి నారాయణ, హెచ్ఓడి డా. టి. నరేష్ కుమార్,డి. గౌస్ పీరా, ఏస్ వీ వరప్రసాద్, వేంపల్లి హనీఫ్, రఘునాథ్ రెడ్డి, అనిల్ కుమార్ ,ఎస్ ఆశ్రాఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



## అట్టహాసంగా కీసర గుట్ట ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

**జయభేరి, కీసర, ఫిబ్రవరి 12 :**




ప్రముఖ శైవ క్షేత్రమైన కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం బుధవారం మహామండపంలో అట్టహాసంగా సాగింది. ఆలయ పాలక మండలి చైర్మన్ తాటకం నారాయణ శర్మ కొనసాగుతుండగా, దేవాలయ ఈవో సుధాకర్ రెడ్డి 13 మంది సభ్యులతో ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో నల్ల మధుసూదన్ రెడ్డి, కౌకుట్ల కృష్ణారెడ్డి, కందాడి రాజిరెడ్డి, పోచమైన రాజు, రెడ్డ బోయిన ప్రవీణ్ కుమార్, మొరుగు ముత్యాలు, జూపల్లి సాయిలు, దుందిగల్ల దుర్గా ప్రసాద్ గౌడ్, సామల అమరేందర్, నల్లోల కుమార్, సగ్గు అనిత, రాపోలు శంకరయ్య, పాముకుంట్ల ప్రభాకర్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు.

పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలయ పండితులు వేదమంత్రాలతో వారిని ఆశీర్వదించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ... దక్షిణ భారతవాణిలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయంలో అన్ని కులాల, అన్ని మతాల దేవుళ్లను సమదృష్టితో చూసిన నాయకుడని కొనియాడారు. సభ్యులందరూ దేవాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

ఈనెల 26 నుండి ప్రారంభమయ్యే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సుమారు 6 లక్షల మంది భక్తులు కీసర గుట్టకు వస్తారని, వారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు కల్పించాలని సూచించారు. భక్తుల కోసం 350 ఆర్టీసీ బస్సులు, బస్ స్టాప్ నుండి గుట్ట పైకి 8 ఉచిత బస్సుల సౌకర్యం కల్పించాలన్నారు. 40 మంది అధికారుల పర్యవేక్షణలో 1800 మంది పోలీసులతో గట్టి బందోబస్తు, పార్కింగ్, మంచినీటి సదుపాయాలు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం వంటి ఏర్పాట్లు చేయాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల రజితోత్సవం ఆత్మీయ సమ్మేళనం

**జయభేరి, యాదాద్రి :**



తెలంగాణ యాదాద్రి జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని ZP హైస్కూల్ లో 1999, 2000 సంవత్సరంలో SSC పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలో Sliver Jubilee సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. వారు Association గా ఏర్పడి తాము చదివిన పాఠశాలలో 40,000తో వంటశాల నిర్మాణం చేసుకొని ప్రారంభించారు. చదువుకున్న పాఠశాలకు విద్యార్థిని విద్యార్థులకు టై, బెల్ట్ రూపంలో సహాయం చేశారు. తమతో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు వివిధ ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉన్న సహాయం చేయడానికి ఈ సంఘం తరఫున ముందుంటున్నారు. ప్రతి విద్యార్థికి భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు షీల్డులను అందించారు. పాఠశాల MEO, ప్రధానోపాధ్యాయుడు K. మహాదేవ రెడ్డి, నాటి ఉపాధ్యాయులు K.నరసింహారెడ్డి హనుమంత రెడ్డి, అశోక్, అంజయ్య, చంద్రయ్య, కరుణాకర్, రఫిక్ తో పాటు 1999 2000 సొసైటీ అధ్యక్షుడు జంగ నరేందర్ యాదవ్, జనరల్ సెక్రటరీ చంద్ర చారి, కోశాధికారి లోడి రవికుమార్ గౌడ్, ముఖ్య సలహాదారులు పాశం జలంధర్ రెడ్డి, దేవి రెడ్డి రామ్ రెడ్డి, బండారి గోవర్ధన్, ఉపాధ్యక్షులు స్వామి, కల్పన, సంయుక్త కార్యదర్శి మిర్యాల గణేష్, కార్యవర్గ సభ్యులు రమేష్ గౌడ్, సంతోష, శ్రీలత, సైదులు, శంకరాచారి, రమేష్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో బాధ్యతలు వహించిన, మాధవ రెడ్డి, జట్ట రవీందర్, శ్రీనివాస్ గౌడ్, స్వామి, సత్తయ్య, రాజిరెడ్డి, సత్యనారాయణ, తోటి విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కులగణన సర్వే దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి
- కులగణన పై మాట్లాడే నైతిక హక్కు ఎవరికి లేదు
- స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం చేసిన ఎమ్మెల్యే



**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 12:**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికి ఆదర్శమని, బిఆర్ఎస్, బిజెపి నాయకులకు కులగణన పై మాట్లాడే నైతిక అర్హత లేదని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుదవారం పరకాల పట్టణంలోని వెల్లంపల్లి రోడ్డులో గల మహాదేవ్ ఫంక్షన్ హాల్ లో పరకాల టౌన్, పరకాల, నడికూడ మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి పాల్గొని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కులగణన పూర్తి చేయడంతో పాటు ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేస్తూ తీసుకున్న నిర్ణయాన్నీ ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలనీ, అలాగే కులగణనపై విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జనాభా ప్రాతిపదికన బీసీ వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేసిన బీసీ కులగణన చారిత్రాత్మకం అని అన్నారు.



రాష్ట్రంలో కులగణన సర్వే నిర్వహిస్తే కేసీఆర్, ఆయన కుటుంబం సహా ఆ పార్టీ నేతలు కొందరు వివరాలు ఇవ్వలేదని మండిపడ్డారు, వీరంతా ఎందుకు సర్వేలో వివరాలు నమోదు చేయలేదో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలే పాలకులు ఇది ప్రజా పాలన ప్రజల ఆర్థిక అభివృద్ధికి చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 55 వేల పై చిలుకు ఉద్యోగాలు భర్తీ చేసామని, ఆర్టీసీ బస్సులల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ 5 లక్షల నుండి 10 లక్షలు వరకు పెంపు, గృహజ్యోతి పథకం, 500 రూ వంట గ్యాస్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ, సన్న వడ్లకు 500 బోనస్, తదితర సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వ్యవస్థలను ఒక్కొక్కటిగా చక్కదిద్దుతూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ క్రమశిక్షణతో ఆదాయ వనరులను సమకూర్చుకుంటూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలపై ద్రుష్టి సాధించామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త సమన్వయంతో పార్టీని పటిష్టపరచాలని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు.

టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ ఏడాది పాలనలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకం తీసుకురావడం, ప్రధాని అయ్యే అవకాశం ఉన్నప్పటికీ కాకుండా మన్మోహన్ సింగ్ ని ప్రధానిని చేసిన ఘనత సోనియా గాంధీది, రాహుల్ గాంధీది అని, ఎన్నో పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఈసందర్భంగా చెప్పారు. రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, పేదల గుండె చప్పుడే కాంగ్రెస్ పార్టీ అని, పేదలను అన్ని విధాలుగా ఆదుకునే పార్టీయే హస్తం పార్టీ అని అన్నారు.

కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి, విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని అన్నారు. గత 10 సంవత్సరాల బి ఆర్ స్ పాలనలో తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రముగా మార్చి రాష్ట్రాన్ని దివాలా తీయించడమే కాకుండా నిరుపేదలకు అందించాల్సిన కళ్యాణ లక్ష్మి పథకం, సీఎంఆర్ఎఫ్ లో కూడా అవినీతికి పాల్పడిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, ఏకసభ్య కమిషన్ ఎస్సీ ల్లోని 59 ఉపకులాలను 3 గ్రూపులుగా విభజించి 1:9:5 నిష్పత్తిలో రిజర్వేషన్లను అమలు చేస్తుందన్నారు.

---



## బిజేపిలో చేరిన వేముల సధారాణి

**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 12:**

భారతీయ జనతా పార్టీ పరకాల అర్బన్ మండలం అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ వజ్రా గార్డెన్ లో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రమేందర్ రెడ్డి, పరకాల కాంటెస్ట్ ఎమ్మెల్యే పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెసరు విజయచందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో పరకాల ప్రముఖ అడ్వకేట్ (42 బూత్) వేముల సధారాణి బిజెపి పార్టీలో చేరినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంతి, మాజీ పరకాల మున్సిపల్ చైర్మన్ మార్త రాజభద్రయ్య, నాయకులు మార్త బిక్షపతి, కుక్కల విజయ్ కుమార్, ఆకుల రాంబాబు, మెంతుల సురేష్, గాజుల రంజిత్, సంగీత, వేముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

---

## విద్యార్థులకు ప్యాడ్లు పెన్నులు డిక్షనరీ స్కేలు పంపిణీ



**జయభేరి, దేవరకొండ :**

లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట 320 ఈ రీజియన్ ఆర్ సి గుడి పూరి వెంకటేశ్వరరావు సహకారంతో తాటి కోల్ జిల్లా పరిషత్ హై స్కూల్ మండలం దేవరకొండ లైన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర 45 మంది విద్యార్థులకు ప్యాడ్లు పెన్నులు డిక్షనరీ స్కేలు పంపిణీ చేయడం జరిగింది ఇటి కార్యక్రమానికి చీఫ్ గెస్ట్ గా రీజియన్ టు చైర్మన్ గడ్డం ప్రదీప్ కుమార్ అధ్యక్షులు లైన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర అధ్యక్షుడు కూరేళ్ల కృష్ణమాచారి కార్యదర్శి మక్కం మహేష్ అంకం చంద్రమౌళి సంధ్యారెడ్డి మరియు చందూరు సేవ అధ్యక్షుడు సంగు జానయ్య ట్రెజరర్ వెంకట్ రెడ్డి ఉపాధ్యాయులు గుడు పూరి వెంకటేశ్వరరావు ని అభినందించినారు.

---

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 38వ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, డిండి :**

మార్చి 2 నుంచి 6 వరకు దాసరినెమిలిపూర్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తెలిపారు.బుధవారం డిండి మండలం దాసరినెమిలిపూర్ గ్రామంలో నిర్వహించే శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 38వ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..... బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రం, గంగిడి నరేందర్ రెడ్డి, గంగిడి కొండల్ రెడ్డి, పసునూరి వెంకటయ్య,తదితరులు పాల్గొన్నారు.

---

## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ లో చేరికలు



**జయభేరి, దేవరకొండ :**

మండల పరిధిలోని కమలాపూర్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ సినియర్ నాయకులు అనుపటి లక్ష్మయ్య, నర్ర వెంకటయ్య, మాచర్ల శ్రీనివాస్,నర్ర శోభన్ బాబు తో పాటు 20 మంది బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీని విడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా వారిని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్,మాజీ ఎంపిటిసి మల్లేపల్లి జీవన్ రెడ్డి,లీల రవికాంత్ రెడ్డి, టిపిసిసి మీడియా అండ్ కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ నర్ర బాలు,మాజీ సర్పంచులు సత్యం,నరీయా నాయక్, కొర్ర శంకర్,మాజి ఎంపీటీసీ బిక్కు నాయక్,మాజీ ఉపసర్పంచ్ రేపని పద్మ యాదయ్య, సివర్ల మధు యాదవ్, కోటి యాదవ్, దుబ్బ చరణ్ ,నల్లగాసు నర్సింహా,వుల్లంకొండ కృష్ణ, రేపని శ్రీను, నర్రా కిషోర్, నల్లగాసు వినోదు,నర్ర విశ్వేశ్వర్, జాజాల ప్రశాంత్, కోట్ర శ్రీను,నల్ల పెద్దయ్య, గండికోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

---

## గొంగడి త్రిషకు సత్కారం

**జయభేరి, హైదరాబాద్:**



అండర్19 మహిళల టీ20 ప్రపంచకప్ లో సత్తా చాటిన గొంగడి త్రిషను ఏఆర్కే ఫౌండేషన్ ఘనంగా సత్కరించింది. ఆరేళ్లుగా త్రిషకు స్పాన్సర్ గా ఏఆర్కే ఫౌండేషన్ ఉంది. ఆమె సాధించిన విజయంపై ఏఆర్కే ఫౌండేషన్ చైర్మన్ రామ్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. హైదరబాద్ బంజారాహిల్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో.... బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, బిసిసిఐ మాజీ చీఫ్ సెలక్టర్ ఎంఎస్కే ప్రసాద్ పాల్గొన్నారు. చిన్న విజయమైనా... వారిని గుర్తించి సత్కరిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని పుల్లెల గోపీ చంద్ అన్నారు. త్రిష...ఎంతో మంది మహిళలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.

---

# బిజెపి బలపరిచిన టీచర్ ఎమ్మెల్సీ కార్యచరణ సన్నాక సమావేశం

**జయభేరి, దేవరకొండ :**



వరంగల్ఖమ్మంనల్గొండ నియోజకవర్గ బిజెపి బలపరిచిన టీచర్ MLC అభ్యర్థి సరోత్తం రెడ్డికి మద్దత్తుగా దేవరకొండ పట్టణంలో ఎమ్మెల్సీ కార్యచరణ సన్నాక సమావేశం నిర్వహించడం జరిగింది ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ ఇంచార్జ్ నూకల నరసింహారెడ్డి పాల్గొన్నారు వారు ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈ సభలో తపస్ మద్దతుతో పోటీ చేస్తున్న భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినారు టిఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ బకాయిలుగా ఉంచిన మూడు డిఏలను ఇంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయలేదు. వాటిని మంజూరు సేవించేందుకు కృషి చేస్తానని అలాగే ఉపాధ్యాయ లోకమంతా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఏకీకృత సర్వీసు రూల్స్ తీసుకురావడానికి కృషి చేస్తానని జీవో 317 బాధితులను తమ స్థానిక జిల్లాలకు పంపేందుకు కృషి చేస్తానని మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్ రెండు సంవత్సరాలుగా మరో ఏడు స్పెషల్ లీవ్ల మంజూరు కి ప్రయత్నిస్తానని సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న ఐటిఐ పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని రాష్ట్రంలో నిర్వహించబడుతున్న గిరిజన సాంఘిక సంక్షేమ మైనారిటీ ఆశ్రమ పాఠశాలలకు నూతన పోస్టుల మంజూరి, సమస్యల పరిష్కారం గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ అధ్యాపకులను బోధనకు పరిమితం చేసి హాస్టళ్లకు వార్డెన్లను సూపర్వైజర్ లను నియమించేలా ప్రయత్నం చేస్తానని శ్రీ సర్వోత్తమ్ రెడ్డి పాత్రికేయ సమావేశంలో పేర్కొనడం జరిగింది అని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, ఉపాధ్యాయ MLC దేవరకొండ నియోజకవర్గం ఎన్నికల కన్వీనర్ వానం నరేందర్, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ, బిజెపి సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, నక్క వెంకటేష్, పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేతాల వెంకటేష్, టీచర్స్ ఎమ్మెల్సీ కో కన్వీనర్ గంజి హరి, సముద్రాల సహదేవ్, సముద్రాల నగేష్, తదితరులు పాల్గొన్నారు.



---

# ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం.. పిఆర్ సి వెంటనే మంజూరుచేయాలి




**జయభేరి, దేవరకొండ :**

ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్ళ్కు కరువు భత్యం 4 విడతలు , పి ర్ సి వెంటనే మంజూరుచేయాలి దేవరకొండ ప్రభుత్వ పెన్షనర్స్ సేవాసదనంలో జరిగిన సమావేశంలో కార్యదర్శి అంకం చంద్రమౌళి కుమారుడు అంకం నాగరాజు తయారుచేసిన భారత దేశ నినాదం "సత్యమేవ జయంతి" మోడల్ సేవాసదనంనకు అందజేసినారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ, సహా అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు బకాయి పడిన 4 విడతల కరువుబత్యం, 2023లో అమలు చేయవలసిన పి ర్ సి వెంటనే మంజూరు చేసి బకాయిలు నగదుగా చెల్లించాలని కోరినారు. పెరిగిన ధరలు వల్ల రోజువారి ఖర్చులకు కష్టము అవుతుంది అన్నారు.

కోశాధికారి పంగనూరు లింగయ్య మాట్లాడుతూ.. హెల్త్ కార్డుపై కార్పొరేట్ వైదశాలలో పెన్షనర్స్ వారికి ఉచిత సేవలు అందించాలని కోరినారు. ఉపాధ్యక్షురాలు, కార్యనిర్వాహాక కార్యదర్శి గారలు గంధం వసంత, మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, పడమటి శాంతకుమారి మాట్లాడుతూ.. మానుండి ఒక శాతం పే తీసుకొని వైదసేవలు ఉచితంగా అందజేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్,వనం బుచ్చయ్య, చెన్నయ్య కార్యవర్గం, కార్యవర్గం సభ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

---



# తెలంగాణలో ఏపీ కోళ్లు బ్యాన్

**జయభేరి, హైదరాబాద్ ఫిబ్రవరి 12ఛ**

తెలుగురాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ టెన్షన్ నెలకొంది. ఏపీలోని పలు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వైరస్తో కోళ్లు మృత్యువాత పడతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుమోలులంకలోని ఓ ఫౌల్ట్రీ ఫామ్లో భారీగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. 24 గంటల్లో 10 వేల కోళ్లు మృతి చెందినట్లు లెక్కలు వేశారు. చనిపోయిన కోళ్లను జనావాసాలకు దూరంగా డిస్పోజ్ చేయాలని వెటర్నరీ అధికారులు సూచించారు. దీంతో చనిపోయిన కోళ్లను భూమిలో పూడ్చిపెట్టారు ఫౌల్ట్రీ యజమాని.మరోవైపు.. గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. గోదావరి జిల్లాల్లో వైరస్తో చనిపోతున్న కోళ్లకు బర్డ్ ఫ్లూగా నిర్ధారణ అయింది. పెరవలి మండలం కానూరు గ్రామ పౌల్ట్రీలలో తీసుకున్న శాంపిల్స్ పాజిటివ్గా వచ్చింది. దీంతో మరోసారి రెడ్ జోన్, సర్వే లెన్స్ జోన్లు ఏర్పాటు చేస్తున్నారు. బర్డ్స్ ఎక్కడ చనిపోతున్నా పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారాన్ని అందించాలని ఆదేశాలు జారీ చేశారు.పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు, ఉంగుటూరు పరిసర ప్రాంతాల్లో సుమారు రెండు లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాయి. బర్డ్ ఫ్లూ కలకలం నేపథ్యంలో కోళ్ల ఫారాల వద్ద పనిచేస్తున్న వారికి ఆరోగ్యశాఖ అధికారులు పరీక్షలు నిర్వహించారు. ఆయా ప్రదేశాల్లో జాగ్రత్తలు వహించాలని కోళ్లఫారాల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు.. బర్డ్ ఫ్లూ పెరుగుదల నేపథ్యంలో ఏపీ సర్కారు ముందస్తు చర్యలు చేపట్టింది.ఏపీలో బర్డ్ ఫ్లూ కలకలంతో తెలంగాణ సర్కారు అప్రమత్తం అయ్యింది. తెలంగాణ సరిహద్దు అయిన కృష్ణాజిల్లాలోనూ బర్డ్ ఫ్లూతో కోళ్లు చనిపోవటంతో.. అక్కడ నుంచి సరఫరాలను నిలిపివేశారు. తెలంగాణ సరిహద్దుల్లో 24 చెక్పోస్ట్లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మూడు చెక్పోస్టులు పెట్టి..ఏపీ నుంచి కోళ్లు రాకుండా చూస్తున్నారు. ఏపీ నుంచి తెలంగాణకు వస్తున్న కోళ్ల వాహనాలను.. అధికారులు వెనక్కి పంపుతున్నారు.బాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ కారణంగా ఆంధ్రా తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన రామాపురంలోని చెక్పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఏపీ నుంచి తెలంగాణకు సరఫరా అయ్యే కోళ్లకు సంబంధించి వాహనాలను తనిఖీ చేస్తున్నారు.వాటిని తెలంగాణలోకి రాకుండా వెనక్కి పంపుతున్నారు. బర్డ్ ఫ్లూ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో..వారం రోజులుగా తనిఖీలను ముమ్మరం చేశారు. ఏపీకి చెందిన ప్రతి వాహనాన్నీ..తనిఖీ చేస్తున్నారు.సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్డు దగ్గర వెటర్నరీ అధికారులు, పోలీసులు చెకింగ్స్ చేస్తున్నారు. ఆంధ్ర నుంచి వస్తున్న కోళ్లను బ్యాన్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ నెల ఏడు నుంచి ఇంతవరకు ఏపీ నుంచి కోళ్ల వాహనాలు తెలంగాణలోకి రాలేదని చెప్పారు. తెలంగాణలో బర్డ్ ఫ్లూ లేనప్పటికీ.. జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.ఇదిలా ఉంటే.. ఆంధ్రలో బర్డ్ఫ్లూ వ్యాప్తితో తెలంగాణలోని గద్వాల జిల్లా వెటర్నరీ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి వస్తున్న కోళ్లు, కోడి పిల్లలు, బాతుల వాహనాలను అడ్డుకొని తిరిగి వెనక్కి పంపుతున్నారు. పుల్లూర్ టోల్ ప్లాజా వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఆంధ్రాలో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాధితో భారీ సంఖ్యలో కోళ్లు చనిపోతుండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఇతర రాష్ట్రాల నుండి వస్తున్న కోళ్లను బోర్డర్లో అడ్డుకుంటున్నారు

# సరోత్తం రెడ్డి ని ఎమ్మెల్సీగా గెలిపించండి

■ డా. ఖాళీ ప్రసాద్

జయభేరి, పరకాల, ఫిబ్రవరి 12:



ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాలలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే పగడాల కాళీ ప్రసాద్ రావు. భారతీయ జనతా పార్టీ వరంగల్ నల్గొండ ఖమ్మం ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాల ఆరేపల్లి సమీపంలోని వజ్ర గార్డెన్స్ లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా మూడున్నర దశాబ్దాలకు పైగా అనుభవమున్న సరోత్తం రెడ్డి, ఆది నుండి ఉపాధ్యాయుల సమస్యల గురించి గళం ఎత్తుతూనే ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, 'సకల జనుల సమ్మె'లో 32 రోజుల పాటు వేలాది మందిఉపాధ్యాయులతో కార్యక్రమాలు నిర్వహించారు. సిపిఎస్ రద్దుకై ఉపాధ్యాయుల తరపున పోరాటం చేశారు. 11వ పిఅర్సి కోసం ఇందిరా పార్కులో ధర్నా నిర్వహించారు. జిఓ 317 వలన ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పోరాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, ఉపాధ్యాయుల సమస్యలను అర్థం చేసుకొని, సమస్యల పరిష్కారానికై పోరాడిన వారిలో సరోత్తం రెడ్డి ముఖ్యులు. పులి సరోత్తం రెడ్డి వరంగల్ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుండి బిజెపి అభ్యర్థిగా పులి సరోత్తం రెడ్డి పోటీ చేస్తున్నారు. మీ అమూల్యమైన ఓటు వేసి ఓటు వేసి గెలిపించగలరని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, మాజీ శాసన సభ్యులు వన్నాల శ్రీరాములు, రాష్ట్రా కార్యవర్గ సభ్యులు విజయ్ చందర్ రెడ్డి, గుజ్జ సత్యనారాయణ, నియోజకవర్గ ఇంచార్జి చంద్ర శేఖర్, కొండేటి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్ లాల్, గురు ప్రసాద్, రామ్ బాబు,జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, ముల్క ప్రసాద్, నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి అండగా నిలిచిన బిఆర్ఎస్ నాయకులు

■ మాజీ ఎంపీపీ పాండు గౌడ్, మాజీ జడ్పిటిసి మంగమ్మ రామచంద్రం, మాజీ వైస్ ఎంపీపీ బాల్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి

జయభేరి, మార్కూక్, ఫిబ్రవరి 12 :

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం దామరకుంట గ్రామానికి చెందిన కటిక నర్సింలుకు పక్షవాతం రావడం జరిగింది. విషయం తెలుసుకున్న మండల మాజీ ప్రజా ప్రతినిధులు మాజీ ఎంపీపీ పాండు గౌడ్, మాజీ జడ్పిటిసి మంగమ్మ రామచంద్రం, మాజీ వైస్ ఎంపీపీ బాల్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కృష్ణ యాదవ్, మాజీ సర్పంచ్ బాల్ నర్సయ్య,సీనియర్ నాయకులు పత్తిబాబు,మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మహేష్,రాజు,రమేష్,సాయిలతో కలిసి ఆర్థిక సహాయం అందజేసి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.

## అప్పుల బాధతో చనిపోయిన కుటుంబాన్ని పరామర్శ


■ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్.



జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 12:

గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర బండారి రవీందర్ మొన్న అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బుధవారం మృతి చెందిన రవీందర్ కుటుంబాన్ని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పరామర్శించారు. మృతుని ఆర్థిక బాధలు తట్టుకోలేక మృత్యువాత పడటంతో కుటుంబనికి పెద్ద దిక్కు లేకుండా పోవడం బాధాకరం అని విచారం వ్యక్తం చేశారు. ఇటీవలే రవీందర్ తండ్రి మల్లయ్య కూడా ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని అన్నారు. మృతునికి భార్య ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఇలాంటి దురదృష్ట సంఘటన జరగడం పట్ల వారి కుటుంబానికి సానుభూతిని తెలుపుతూ పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో వారి వెంట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, గ్రామ సీనియర్ నాయకుడు విష్ణు రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రమేష్, నాయకులు యాదగిరి, బిక్షపతి, నరేష్ మరియు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## పేదింటి ఆడపడుచుకు పుస్తే మట్టెలు



జయభేరి, వర్గల్, ఫిబ్రవరి 12 :

పేదింటి ఆడపడుచు వివాహానికి పుస్తె మట్టెలు, పెండ్లి చీరె అందజేసే వారికి అండగా నిలిచాడు శ్రీ నూతన గౌడ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుండుకాడి వెంకటేష్ గౌడ్. బుధవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం వేలూరు గ్రామంలో వారి నివాసంలో కుమ్మరి చంద్రం కూతురు రిత్విక కు ఆయన చేతుల మీదుగా పుస్తె మట్టలు, పెండ్లి చీరే అందజేశారు. ఈ వివాహం ఈనెల 14 వ తేదీన జరుగనున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఎన్ని ఆస్తులు డబ్బులు సంపాదించిన కలగని సంతోషం నిరుపేద కుటుంబాలకు సాయం చేయడంలో ఎంతో సంతోషం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామమస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏలాంటి నోటీసులు లేవు.. సర్వే ఎలా చేస్తారు..!

■ అధికారులను అడ్డుకున్న కొండపాక మండల రైతులు..



జయభేరి, కొండపాక, ఫిబ్రవరి 12:

ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సర్వే ఎలా జరుపుతారని కొండపాక రైతులు ఆవేదన వ్యక్తం చేసి సర్వే ను అడ్డుకున్నారు.కొండపాక మండలం దుద్దెడ, జప్తి నాచారం, మర్పడగ, ఖమ్మంపల్లి గ్రామలలో నేషనల్ హైవే కి సంబంధించిన సర్వే పనులను బుధవారం అధికారులు చేపట్టారు. ఇదిలా ఉండగా మండలంలోని జప్తి నాచారం గ్రామ రైతులు సర్వేను అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగి మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని వారు అధికారులను ప్రశ్నించారు. సర్వే పనులను రైతులు అడ్డుకోవడంతో అధికారులు వినతిరిగి వెళ్ళారు.



## శ్రీ శిరిడి సాయిబాబా, శ్రీ సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న మాజీ ఎఫ్డీసీ

■ మాజీ ఎఫ్ డి సి చైర్మన్ ప్రతాప్ రెడ్డి

జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 12:

గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామంలో శ్రీ సమ్మక్క సారలమ్మను, గజ్వేల్ పట్టణంలో శిరిడి సాయిబాబా మందిరంలో ప్రత్యేకమైన పూజలు చేసిన మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అనంతరం సమ్మక్క సారలమ్మలను, సాయిబాబా ఆశీర్వాదాలు తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు.. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శిరీష రాజు, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఖజా విరాసద్ అలీ, అత్తిలి రవి, తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికలు వస్తాయి పోతాయి.. కానీ ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలి..

■ గౌరారం గ్రామాన్ని సందర్శించిన ఎస్ఐ కరుణాకర్ రెడ్డి




జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 12:

రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి వాటిని అడ్డం పెట్టుకొని గొడవలకు దిగవద్దని శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని సూచించారు. ప్రజల రక్షణ మరియు సెన్సాఫ్ సెక్యూరిటీ గురించి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దు. ఆన్లైన్ మోసాల బారిన ఎవరు కూడా పడవద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 సైబర్ సెల్ జాతీయ హైల్ప్ లైన్ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో ఎవరు కూడా బెల్ట్ షాప్ నడపవద్దని సూచించారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే మరియు ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

## మండల జనసేన పార్టీ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే

జయభేరి, పరవాడ:





మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో మరిడిమాంబ కళ్యాణ మండపంలో పరవాడ మండలం జనసేన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంను జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా పంచకర్ల రమేష్ బాబుని జనసేన పార్టీ ముఖ్య నాయకులు పూలదండతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ ఆత్మీయ సమావేశంలో పాల్గొనడం ఆనందకరమైన విషయం అన్నారు. కూటమి ప్రభుత్వం లో జనసేన నాయకులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. నియోజక వర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేయడం కోసం, అదేవిధంగా పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకుని వెళ్ళాలని అనేక అంశాలపై సమావేశంలో చర్చించారు. అలాగే గ్రామాలలో ప్రధాన సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి ఏవిధంగా కృషి చేయాలి అనే పలు సమస్యలపై చర్చలు జరిపారు.ఈ కార్యక్రమంలో మండల జనసేన ఇంచార్జి పంచకర్ల ప్రసాద్ రావు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దపూ శ్రీనివాస్, జనసేన పార్టీ ఉమ్మడి రూరల్ జిల్లాల కార్యదర్శి బుగిడి రామ గోవింద్ రావు, పరవాడ, రావాడ, ముత్యాలంపాలెం సర్పంచ్లు, బల్రెడ్డి అప్పారావు, వర్రీ పరదేశి నాయుడు, దుల్ల రామనాయుడు, పిల్లా శివ కృష్ణ ,గవరా సోము శేఖర్, సత్య రావు, కేవిఎస్ఆర్, గొన్న రమాదేవి, నక్క శ్రీనివాస, పచ్చికోరి లక్ష్మీ, సబ్బవరం మండలం జనసేన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గజ్వేల్ పట్టణంలో పట్టభద్రుల ఎన్నికల బిజెపి నాయకుల ప్రచారం

జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 12:



ఉమ్మడి కరీంనగర్ నిజామాబాద్ అదిలాబాద్ మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ బిజెపి బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డి మద్దతుగా గోదావరి అంజి రెడ్డి కోర్టు బార్ అసోసియేషన్, ఆర్మీ అకాడమీలో ప్రచారం నిర్వహించారు. వారి వెంట గజ్వేల్ పట్టణ, మండల అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, పంజాల అశోక్ గౌడ్ లు ఉన్నారు.. రెండు దశాబ్దాలకు పైగా ప్రజాసేవలో అందరి ఆదరాభిమానాలను సంపాదించారు తన వ్యాపారంలో భాగంగా వందల మందికి ఉపాధి కల్పించారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం, స్కాలర్షిపులు అందించారు. ప్రభుత్వ బడులు, కళాశాలల్లో మౌలిక వసతుల కోసం విరాళాలు అందించారు. ఆయా ప్రభుత్వ బడుల్లో, కళాశాలల్లో ₹ 60 లక్షల రూపాయల విలువైన ల్యాబ్స్ సౌకర్యం కల్పించారు. ఎస్ఆర్ ట్రస్ట్ స్థాపించి ఉచిత నీటి వసతి కల్పించారు. చాలా ప్రాంతాల్లో ఆర్ ఓ ప్లాంట్లను స్థాపించి 24 గంటలు ఉచితంగా నీటి పంపిణీ చేశారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు రూ.40 లక్షలకు పైగా నష్ట పరిహారం అందజేశారు. ఆటోడ్రైవర్లకు, పేదలకు ఉచితంగా ఆరోగ్య బీమా సదుపాయం కల్పించారు. అంజిరెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని శాసనమండలిలో పట్టభద్రుల తరపున మాట్లాడే గొంతుకను నిలబెట్టండి అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, ఉప్పల మధుసూదన్, నీల చంద్రం, నాయిని సందీప్ కుమార్, తిరుపతి రెడ్డి, మంద వెంకట్, భాస్కర్ రెడ్డి, నరసింహాచారి, కొన్ని రాజశేఖర్ రెడ్డి, గణేష్, కుమార్ గౌడ్, భీం కుమార్, హరి కుమార్, దుబ్బకుంట భక్త మాల, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ లింగం కు ఘన సన్మానం

జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 12:



గజ్వేల్ లో ప్రముఖ వైద్యులు డాక్టర్ లింగం శైలజ దంపతులు ఇటీవల హైదారాబాద్ లో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా వైద్య శిరోమణి అవార్డ్ అందుకున్న సందర్భంగా బుదవారం వైశ్య నాయకులతో కలిసి మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి ఆధ్వర్యంలో డాక్టర్ లింగం శైలజ దంపతులను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.అనంతరం మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ వైద్య వృత్తిలో డాక్టర్ లింగం డాక్టర్ శైలజ దంపతులు మంచి గుర్తింపు పొంది, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, సమాజ సేవలో ముందు వరుసలో ఉంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఇటీవల హైదారాబాద్ లో వైద్యశిరోమణి అవార్డులు అందుకున్న సందర్భంగా వారికి చిరు సన్మానం చేయడం జరిగిందని భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య,నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ,గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహంకాళి శ్రీనివాస్,కైలాస ప్రభాకర్, అత్తెల్లి శ్రీనివాస్,నేతి శ్రీనివాస్ ,రాజేశ, ఉప్పల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.





# దళపతి విజయ్‌పై షాకింగ్ కామెంట్స్..

కోలీవుడ్ స్టార్స్ రజనీకాంత్, దళపతి విజయ్ అభిమానుల మధ్య తరచుగా గొడవలు జరుగుతూనే ఉంటాయి. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ఈ హీరో అభిమానుల మధ్య ఫ్యాన్ వార్ నిత్యం జరుగుతూనే ఉంటుంది. తాజాగా రజనీకాంత్ అభిమాని ఒకరు దళపతి విజయ్ గురించి చెడుగా మాట్లాడాడు. ఇది రజనీకాంత్ దృష్టికి వెళ్లడంతో ఆయన బృందం వెంటనే స్పందించింది. ఇతర హీరోలను దూషించే అభిమానులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. ఇలాంటి ప్రవర్తన పునరావృతం కాకుండా చూసుకోవాలని అభిమానులను హెచ్చరించింది. “రజనీకాంత్ అభిమానిని అని చెప్పుకునే వ్యక్తి విజయ్ గురించి చెడుగా మాట్లాడటం అభ్యంతరకరం.” ఇలాంటి మాటలు సహించలేం. “నిజమైన రజనీకాంత్ అభిమానులు అలాంటి పనులు చేయరు” అని రజనీకాంత్ బృందం ఒక ప్రకటనలో తెలిపింది. ‘సినిమా అనేది ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడానికే.’ ఇది ప్రజల మధ్య అంతరాలు సృష్టించడం గురించి కాదు. అభిమాని అనే పేరుతో ఎవరూ ఇతర నటులపై ద్వేషాన్ని వ్యాప్తి చేయకూడదు. రజనీకాంత్ అభిమానులుగా మనం అలాంటి పనులు చేయకూడదు. నాకు ఇష్టమైన హీరోని సానుకూలత మరియు ప్రేమతో జరుపుకుందాం. గౌరవం మరియు గర్వం యొక్క సంస్కృతిని నిర్వచించుకుందాం. “ద్వేషంతో కాదు” అని రజనీకాంత్ బృందం పేర్కొంది. రజనీకాంత్ ప్రస్తుతం ‘కూలీ’ సినిమా పనిలో బిజీగా ఉన్నారు. ఈ చిత్రానికి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా తర్వాత రజనీకాంత్ ‘జైలర్ 2’ సినిమా చేయనున్నారు. మరోవైపు విజయ్ దళపతి ‘జన నాయగన్’ సినిమాలో నటిస్తున్నాడు. ఇది అతని ఆఖరి సినిమా అని కోలీవుడ్ లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రాజకీయ పార్టీని స్థాపించిన విజయ్ వచ్చే ఏడాది తమిళనాడులో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగనున్నారు.

# ప్రభాస్‌తో కలిసి నటించాలనుకుంటున్నారా?



సలార్, ‘కల్కి 2898 AD’ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్నాడు పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్. ప్రస్తుతం అతను చేతిలో అరడజను సినిమాలున్నాయి. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ‘ది రాజా సాబ్’ సినిమా విడుదల కోసం ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. దీనితో పాటు, ప్రభాస్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించనున్న ‘స్పిరిట్’ చిత్రంలో కూడా నటించనున్నాడు. ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్ కాబట్టి అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సినిమాలో కొత్తవారికి అవకాశం ఇస్తున్నారు. దానికి సంబంధించిన సమాచారాన్ని చిత్ర బృందం పంచుకుంది. ‘స్పిరిట్’ చిత్రాన్ని ‘భద్రకాళి పిక్చర్స్’ ‘టి సిరీస్’ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఆడిషన్ల గురించిన వివరాలను నిర్మాణ సంస్థ సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. అయితే ఫిలిం లేదా థియేటర్ బ్యాగ్రౌండ్ ఉన్న యాక్టర్స్ ను మాత్రమే తీసుకోబోతున్నట్లు చెప్పారు. రెండు ఫోటోలను, 2 నిమిషాల ఇంట్రడక్షన్ వీడియోలను అఫీషియల్ మెయిల్ ఐడీ spirit.bhadrakalipictures@gmail.com కి పంపించాలని సూచించారు. ఇంట్రడక్షన్ వీడియోలో పేరు, ఎడ్యుకేషన్, అనుభవం వంటి వివరాలు తెలియజేయాలని సూచించారు. ఈ మేరకు భద్రకాళి పిక్చర్స్ సంస్థ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. ప్రభాస్, సందీప్ రెడ్డి వంగాలకు పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్, డిమాండ్ ఉంది. కాబట్టి ‘స్పిరిట్’ కూడా పాన్ ఇండియా సినిమా అవుతుంది. అన్ని భాషల నుండి ప్రముఖ కళాకారులు నటించే అవకాశం ఉంది. కొత్త కళాకారులకు అవకాశం ఇవ్వడం కూడా మంచి విషయం. చాలా మంది ప్రభాస్ నటిస్తున్న సినిమాలో కూడా నటించాలని కోరుకుంటారు. అలాంటి వారు తమ కలలను నిజం చేసుకోవడానికి ఇది సరైన అవకాశం. మరెందుకు లేటు వెంటనే ఈ అవకాశాలన్ని సద్వినియోగం చేసుకోండి.



# హరివిల్లు వంటి ఒంపు సొంపులు ఈమె సొంతం..


సౌత్ హీరోయినే అయినా.. గ్లామర్ విషయంలో నార్త్ బ్యూటీస్‌కు కూడా పోటీ ఇచ్చే అందాల భామ మాళవిక మోహనన్. కెరీర్‌లో బిగ్ సక్సెస్‌లు లేకపోయినా.. ఫిలిం సర్కిల్స్‌లో ఈ బ్యూటీ పేరు గట్టిగానే వినిపిస్తుంటుంది. తాజాగా సోషల్ మీడియా వేదిక ఈ కోమలి షేర్ చేసిన ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. మీరు కూడా ఈ ఫోటోలపై ఓ లుక్కేయండి. 4 ఆగస్టు 1993న కేరళ రాష్ట్రంలోని కన్నూర్ జిల్లాలోని పయ్యనూర్ లో జన్మించింది వయ్యారి భామ మాళవిక మోహనాన్. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.యు. మోహనన్ కూతురు ఈ బ్యూటీ. మహారాష్ట్ర రాజధాని ముంబైలో పెరిగింది ఈ ముద్దుగుమ్మ. తన తండ్రిలనే సినిమాటోగ్రాఫర్‌గా లేదా దర్శకురాలిగా అవ్వాలన్న ఆశతో ముంబైలోని విల్సన్ కాలేజీలో మాస్ మీడియాలో డిగ్రీ పూర్తి చేసింది. ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి నటించిన ఫెయిర్‌నెస్ క్రీమ్ కోసం కమర్షియల్ షూట్‌కి ఆమె తన తండ్రితో కలిసి వెళ్లింది. మాళవికకు నటనపై ఉన్న ఆసక్తి గురించి నటుడు ఆరా తీసి మలయాళ చిత్రంలో తన కుమారుడు దుల్కర్ సల్మాన్ సరసన నటించే అవకాశం కల్పించారు. తన నిర్ణయం కోసం కొంత సమయం తీసుకుని గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆలా పట్టం పోల్ అనే మలయాళీ చిత్రంతో కథానాయకిగా తొలిసారి నటించింది. 2016లో నాను మట్టు వరలక్ష్మి అనే చిత్రంతో కన్నడలో పరిచయం అయింది. 2019లో పేట చిత్రంతో తమిళ అరంగేట్రం చేసింది. ప్రస్తుతం ప్రభాస్ ప్రధాన పాత్రలో మారుతి దర్శకత్వంలో రాజాసాబ్‌లో హీరోయిన్‌గా తొలిసారి డైరెక్ట్ తెలుగు మూవీ చేస్తుంది.



# ఈ సుకుమారి సొగసును చూసి వెన్నల చిన్నబోదా..

నేహా శెట్టి.. ఈ పేరు కంటే రాధిక అంటే టక్కున గుర్తుపట్టేస్తారు. మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టి 2016లో కన్నడ చిత్రం ముంగారు మలే 2తో తెరంగేట్రం చేసింది ఈ బ్యూటీ. ప్రస్తుతం తెలుగు చిత్రాల్లో ఎక్కువగా కనిపిస్తుంది ఈ ముద్దుగుమ్మ.

ఆకాష్ పూరి హీరోగా కనిపించిన ‘మెహబూబా’ సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన నేహ శెట్టి.. ఆ తర్వాత సందీప్ కిషన్ సరసన 'గల్లీ బాయ్'తో తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. కానీ ఈ రెండు చిత్రాలు కూడా బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడ్డాయి. 2023లో కామెడీ డ్రామా చిత్రం 'బెదురు లంక 2012'లో కార్తికేయకి జోడిగా నటించి మరో హిట్ దక్కించుకుంది ఈ ముద్దుగుమ్మ. అదే ఏడాది కిరణ్ అబ్బవరంకి జోడిగా 'రూల్స్ రంజన్' సినిమాలో కథానాయకిగా నటించింది. ఈ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేదు. 2024లో వచ్చిన సిద్దు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన టిల్లు స్క్వేర్‌లో మరోసారి రాధికగా అదితి పాత్రలో ఆకట్టుకుంది. తర్వాత విశ్వక్‌సేన్ సరసన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లో హీరోయిన్‌గా నటించింది.





# డార్లింగ్ టూ చిరు.. ఎవరి షూటింగ్ ఎక్కడ?

చిరంజీవి స్టెప్పులేస్తే.. వేస్తే ఏంటి? వేయడానికి అన్నీ రెడీ అయిపోయాయి.. అటు ప్రభాస్ యాక్టివ్‌గా లొకేషన్లకు వెళ్లిపోతున్నారు. రామోజీ ఫిల్మ్ సిటీలోనూ కొందరు స్టార్లు హలో అంటే హలో అనుకుంటున్నారు. వీళ్ల ముచ్చట్లు సరే, మిగిలిన వారి సంగతేంటి.. అంటారా? కమాన్ లెట్స్ వాచ్...

ప్రభాస్ ఇప్పుడు సూపర్ యాక్టివ్ మోడ్‌లో ఉన్నారు. ఆయన నటిస్తున్న రాజా సాబ్ షూటింగ్ అజీజ్‌నగర్‌లో, ఫౌజీ షూటింగ్ అల్యూమినియమ్ ఫ్యాక్టరీలో జరుగుతున్నాయి. మరి డార్లింగ్ ఆన్ అండ్ ఆఫ్‌గా రెండు సెట్లనూ కవర్ చేస్తున్నారా? లేకుంటే, ఆయన లేని పోర్షన్ ఓ చోట, ఆయనున్న సీన్స్‌తో మరోచోట కానిచ్చేస్తున్నారా? అనేది ఫ్యాన్స్‌కి ఆసక్తికరంగా మారింది. ప్రభాస్ ఇప్పుడు సూపర్ యాక్టివ్ మోడ్‌లో ఉన్నారు. ఆయన నటిస్తున్న రాజా సాబ్ షూటింగ్ అజీజ్‌నగర్‌లో, ఫౌజీ షూటింగ్ అల్యూమినియమ్ ఫ్యాక్టరీలో జరుగుతున్నాయి. మరి డార్లింగ్ ఆన్ అండ్ ఆఫ్‌గా రెండు సెట్లనూ కవర్ చేస్తున్నారా? లేకుంటే, ఆయన లేని పోర్షన్ ఓ చోట, ఆయనున్న సీన్స్‌తో మరోచోట కానిచ్చేస్తున్నారా? అనేది ఫ్యాన్స్‌కి ఆసక్తికరంగా మారింది. మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు అభిమానులు. ఈ ఏడాది మెగా హిట్ విశ్వంభరతో పక్కా అనే క్లారిటీ వాళ్లది. ఈ సినిమా షూటింగ్ కోకాపేటలో బుధవారం నుంచి జరుగుతుంది. ఈ షెడ్యూల్‌లో మెగాస్టార్‌తో స్టెప్పులేయిస్తున్నారు వశిష్ట. మొన్నటిదాకా ముచ్చింతల్‌లో జరిగిన అఖండ2 షూటింగ్ ప్రస్తుతం ఏడెకరాలలో జరుగుతోంది. అఖండ తాండవం పేరుతో ఈ శివరాత్రికి అప్‌డేట్ ఇస్తారన్నది ఫ్యాన్స్ ఆశ. బాలయ్య బోయపాటి కాంబోలో నాలుగవ చిత్రమిది. బాలయ్య వెళ్లొచ్చిన ముచ్చింతల్‌కి ఇప్పుడు పవన్ కల్యాణ్ ట్రావెల్ చేస్తున్నారు. హరిహరవీరమల్లు షూటింగ్ ఆ పరిసరాల్లోనే జరుగుతోంది. నిఖిల్ స్వయంభూ సినిమా షూటింగ్ మాత్రం జానవాడలో జరుగుతుంది. నాని హీరోగా శైలేష్ కొలను డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్ అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. అక్కడే అల్లరి నరేష్ మూవీ పనులు కూడా స్పీడందుకున్నాయి. సాయి దుర్గ తేజ్ హీరోగా హనుమాన్ ప్రొడ్యూసర్ నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా షూట్ తుక్కుగూడకి షిఫ్ట్ అయింది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com